క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి..

పార్వతీపురం టౌన్: పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, సిబ్బందికి చట్టబద్ధమైన సెలవులు ఇవ్వడంతో పాటు పనిముట్లు, రక్షణ పరికరాలు అందజేయాలని కోరారు. పాలకులు ఎంతమంది మారినా మున్సిపల్ కార్మికుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించని ఎడల భవిష్యత్‌లో ఉద్యమం చేపట్టక తప్పదన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: మండలానికి రూ. 3.65 కోట్లతో మంజూరైన అభివృద్ధి పనులకు గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం శంకుస్థాపనలు చేశారు. చంద్రప్పవలస నుంచి ముగడవలసకు రోడ్డు..చిన్నవలస కూడలి నుంచి పునికినివలసకు బీటీ రోడ్డు.. కొత్తవలస పంచాయతీ గుంద్రపువలస నుంచి కరాసువలస పంచాయతీకి బీటీ రోడ్డులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, ఐటీడీఏ డీఈ మణిరాజ్, జేఈ సంతోష్ పాల్గొన్నారు.

పురపాలక సంఘ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే విజయ్ చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

పార్వతీపురం టౌన్: పురపాలక సంఘ అభివృద్ధే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర కోరారు. పార్వతీపురం పురపాలక సంఘ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రతిరోజూ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏడో రోజూ కొనసాగిన జ్ఞానయజ్ఞం



యాగ పూజలు చేస్తున్న రుత్విక్కులు

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి ప్రారంభమైన జ్ఞానయజ్ఞ పూజలు ఏడో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ, 20 మంది రుత్విక్కులతో హోమాలు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల ద్వారానే పనులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

సాలూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను గ్రామ పంచాయతీల ద్వారానే చేపట్టేలా చూడాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, సువ్వాడ రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ రమాదేవిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న ఉపాధి ఏపీఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

బలిజిపేట: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు తహసీల్దార్ కార్యాయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ రత్నకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యుడు డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.



రాత్రికి రాత్రే.. కనెక్షన్లు పీకేశారు

- పునికినవలసపై విద్యుత్ శాఖ కన్నెర్ర
- బకాయిలున్నారంటూ సరఫరా కట్
- ఇబ్బంది పడిన ప్రజలు
- సోమవారం సాయంత్రానికి సరఫరా పునరుద్ధరణ

సాలూరు రూరల్:

మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పునికినవలస గిరిజనులపై విద్యుత్ శాఖ కన్నెర్ర చేసింది. గ్రామంలో ఉన్న సుమారు 150 కుటుంబాల వారంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నవారే. అయితే ఉన్నట్టుండి ఒక్కసారిగా విద్యుత్ బిల్లులు వేలల్లో బకాయిలున్నట్లు చూపించడంతో స్థానిక లైన్‌మన్ బిల్లులు చెల్లించాలంటూ ఒత్తిడి చేశారు. అయితే కొద్ది రోజుల్లో చెల్లించేందుకు ప్రయత్నిస్తామని చెప్పినప్పటికీ, అధికారులు ఆదివారం సాయంత్రం కనెక్షన్లు కట్ చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులతో రాత్రంతా ఇబ్బంది పడతామని.. సోమవారం ఉదయం ఎంతోకొంత కడతామని చెప్పినా సిబ్బంది పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు 150 ఇళ్లు ఉండగా.. ఆదివారం సాయంత్రం 20 ఇళ్లకు సరఫరా నిలిపివేశారు. క్రమం తప్పకుండా బిల్లులు కడుతున్నా ఎందుకు బకాయిలున్నాయో అర్థం కావడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

సరఫరా పునరుద్ధరించాం...

వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సోమవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. కుల ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డుల్లోని పొరపాట్ల వల్ల జూన్ 2022 నుంచి వీరికి సబ్సిడీ వర్తించకపోవడంతో బిల్లులు వేల రూపాయలకు చేరుకున్నాయి. అయితే బిలుల్ల వసూలు పేరు చెప్పి కనెక్షన్లు కట్ చేయడంలో సిబ్బంది తొందరపడ్డారు. ఏదిఏమైనా వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– రంగారావు, ట్రాన్స్‌కో ఎ.డి

బతిమాలినా పట్టించుకోలేదు..



చంటి పిల్లలున్నారు.. సరఫరా కట్ చేయకండి.. ఒకేసారి రూ. 12 వేలు కట్టమంటే కష్టం.. ఎంతోకొంత సోమవారం ఉదయానికి కడతామని చెప్పినా లైన్‌మన్ స్పందించలేదు. ఫ్యూజులు తీసేయడంతో ఆదివారం రాత్రంతా ఇబ్బంది పడ్డాం. వినియోగం తక్కువైనా వేల రూపాయల్లో బిల్లులు ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదు.

– చందాపు అన్నపూర్ణ, పునికినవలస

రూ. 7500 చెల్లించాను..



రూ.7500 రూపాయల విద్యుత్ బిల్లు చెల్లించాను. మరో ఎనిమిది వేల రూపాయల బిల్లు పెండింగ్ ఉందని చెబుతున్నారు. ఒకేసారి 30 మందికి వేల రూపాయల్లో బిల్లులు వచ్చాయి. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. అధికారులు బిల్లుల విషయంలో దృష్టి సారించి న్యాయం చేయాలి.

– బద్నాన సన్యాసి మాజీ సర్పంచ్, పునికినవలస

ఒక ఫ్యాన్, ఒక బల్బుకు రూ. ఏడు వేలు



ఒక ఫ్యాన్, ఒక బల్బు వినియోగిస్తున్నాం. అది కూడా పూరిపాకకు ఇంత బిల్లు ఎందుకు వచ్చిందంటే సరైన సమాధానం చెప్పడం లేదు. మేము ఈ బిల్లులు కట్టలేము. అధికారులు బిల్లులు తగ్గించే విషయంలో దృష్టి సారించడం లేదు కాని.. బకాయిల పేరు చెప్పి సరఫరా మాత్రం నిలిపివేస్తున్నారు.

– ఎస్. మరియమ్మ, బాధితురాలు పునికినవలస

సమస్యలు పరిష్కరించాలి..



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

సీతానగరం: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సురేష్, కె. డేవిడ్ డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వంద రోజుల్లో పరిష్కరిస్తామని విద్యాశాఖా మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని... ఇంతవరకు హామీ నిలబెట్టుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే చెల్లించాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని.. తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలపై స్పష్టత ఇవ్వాలన్నారు. యువగళం పేరుతో ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన లోకేష్ తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి, ఇప్పుడు మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ ఉమామహేశ్వరరావుకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్ మోహనరావు



రోగులతో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రాం అధికారి టి. జగన్ మోహనరావు సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని డోకిశీల పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రోగుల ఆరోగ్య తనిఖీ రికార్డులు పరిశీలించారు. ప్రసవాల గదిని, కాన్పుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో సాయంత్రం, రాత్రివేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం తాళ్లబురిడిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి. ఐశ్వర్య, కె. కౌశిక్, డీఎస్ఓ శంకర్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, జయ, తదితరులున్నారు.

టీడీపీ నాయకుల వేధింపులు దారుణం



బలిజిపేట ఎంఆర్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఎండీఎం నిర్వాహకులు

బలిజిపేట: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించక పోగా.. టీడీపీ నాయకులు తిరిగి వేధిస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంఆర్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పాలకులు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శాసనసభ్యుడు విజయ్‌చంద్ర కొంతమంది నిర్వాహకులను తొలగించమన్నారని.. అందువల్లే తొలగిస్తున్నట్లు కొంతమంది టీడీపీ నాయకులు దురుసుగా వ్యవహరించడం అన్యాయమన్నారు. నిర్వాహకులకు గుర్తింపు కార్డులు, చీరలు ఇవ్వడంతో పాటు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలియజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

సీతానగరం: తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏలు కోరారు. ఈ మేరకు సీఐటీయూ కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో వీఆర్ఏల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి. సూరయ్య, ఎస్. జోగులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు ఆనంద్, కిశోర్, గురువులు, చిట్టెమ్మ, ఆసిరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గిరిజన సమస్యలు..

పార్వతీపురం: గిరిజన సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్వతీపురం మండలం కొత్తలిడికివలస గ్రామ గిరిజనులకు 2020లో ఇచ్చిన డీ పట్టా భూములను అసైన్ చేసి రైతుభరోసా, పీఎం కిసాన్, తదితర పథకాలు వర్తించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మల్లయ్య, ఏకలవ్య పాఠశాల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే దీపావళి సామన్ల ధరలు నియంత్రించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సంచాన ఉమామహేశ్వరరావు, పాకల సన్యాసిరావు, తదితరులు కోరారు. ఈ మేరకు డీఆర్ఓ జి. కేశవనాయుడుకు వినతిపత్రం అందజేశారు.

అభినందన

సీతానగరం: మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాల విద్యార్థి పి. శ్రీచరణ్ శ్రీకాకుళం జిల్లాలో నవంబర్ 2, 3, 4 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరుగునున్న అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడని పాఠశాల హెచ్ఎం శంకరరావు అన్నారు. ఈ మేరకు విద్యార్థిని సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జగదీష్, రామకృష్ణదొర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆస్పత్రులను అభివృద్ధి చేద్దాం

- ఎంపీడీఓ, తహసీల్దార్



సమావేశంలో పాల్గొన్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

మక్కువ: ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆస్పత్రులను అభివృద్ధి చేసుకుందామని ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం అన్నారు. మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఆస్పత్రుల అభివృద్ధికి కేటాయిద్దామని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో హరీష్ ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థి హరీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ, తదితరులు

సాలూరు: సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ముళ్ల హరీష్ పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ నెల 17 నుంచి 19 వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో ముళ్ల హరీష్ 3 వేల మీటర్ల రన్నింగ్ విభాగంలో మెదటి స్థానం, 5 వేల మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం సాధించాడని చెప్పారు. కార్యక్రమంలో పీడీ శివాజీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పాడి రైతులకు అన్యాయం

పార్వతీపురం టౌన్: పాల సేకరణ ధరలు తగ్గించడం చాలా అన్యాయమని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ పాల రైతుల సంఘ రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్ అన్నారు. పార్వతీపురం మండలం డి ములగ గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సంఘం పరిధిలోని పాడి రైతులతో సంఘ అధ్యక్షుడు తాన శంకరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీ నిర్వాహకులు ఆవు పాలపై మూడు రూపాయల నుంచి నాలుగు రూపాయల వరకు ధరలు తగ్గించడం చాల దారుణమన్నారు. కొంతమంది దళారిల వల్ల డెయిరీలో రకరకాల అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 29న గాజువాకలోని విశాఖ డెయిరీ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, పాడి రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు సీనియార్టీ జాబితాలు రూపొందించాలి

పార్వతీపురం టౌన్: మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు వేర్వేరుగా సీనియారిటీ జాబితాలు తయారు చేసి ఉమ్మడి జిల్లా ప్రాప్తికి పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ సోమారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు అన్ని సబ్జెక్టుల పాఠశాల సహాయకుల నుంచి ఉమ్మడి సీనియార్టీ జాబితా తయారు చేయాలని కోరారు.

వేతనం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మక్కువ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల వేతనం పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై. నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని, ఇది సరికాదని హితవు పలికారు. చాలీచాలని జీతాలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వారికి వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు జి.కృష్ణ, దాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు చక్కటి అవకాశం

సీతానగరం: భూముల రీ సర్వే సమయంలో చోటుచేసుకున్న తప్పులను సవరించుకోవడానికి రీ సర్వే గ్రామసభలు చక్కటి అవకాశమని రంగంపేట సచివాలయ సర్వేయర్ బి.శ్రావణి అన్నారు. కోట సీతారాంపురంలో రీసర్వే గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూ రికార్డుల్లో తప్పులు పడితే దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలించి సరి చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఉదయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలోనే గిరిజన యూనివర్సిటీ

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలోనే కేంద్రియ గిరిజన యూనివర్సిటి ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వివిధ కళాశాలల విద్యార్థులు సోమవారం స్థానిక జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సింహాద్రి, సంజీవ్, కల్యాణ్, జానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు, స్టాఫ్ యూనియన్ సభ్యులు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద స్టాఫ్ యూనియన్ అధ్యక్షుడు ఆర్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏజెంట్లు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలసీపై బోనస్‌లు పెంచాలని, జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పాలసీలపై ఏజెంట్ కమీషన్ పెంచాలన్నారు. యూనియన్ కార్యదర్శి టెక్కలి ధర్మ, ఉద్యోగులు ఏజెంట్లకు మద్దతు తెలియజేశారు.

ఎండీఎం నిర్వాహకుల నిరసన



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న నిర్వాహకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నిర్వాహకుల సంఘ జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీ రమణ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎండీఎం నిర్వాహకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని.. సకాలంలో గౌరవ వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడెందుకు హామీలు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఎంఈఓ జి. సూరిదేముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘ జిల్లా సభ్యులు కె. రమణమ్మ, పి. కుమారి, సీహెచ్ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

– సీతానగరం

ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు

పాఠశాలలకు చెందిన యాప్‌లు సాంకేతిక లోపంతో ఓపెన్ కాకపోవడంతో ఉపాధ్యాయులకు ఇబ్బంది తప్పడం లేదు. ముఖ్యంగా అటెండెన్స్ యాప్, ఐఎంఎంఎస్ యాప్‌లు సక్రమంగా పని చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు సకాలంలో వచ్చినా స్కూల్ అటెండెన్స్ యాప్ ఓపెన్ కాకపోవడంతో చాలా సమయం నిరీక్షించాల్సి వస్తోందని చెబుతున్నారు. అదే విధంగా ఐఎంఎంఎస్ యాప్ ఓపెన్ కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు సంబంధించిన వివరాలు నమోదు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. ఉన్నతాధికారులు యాప్‌ల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఓపెన్ కాని స్కూల్ అటెండెన్స్ యాప్



ఓపెన్ కాని ఐఎంఎంఎస్ యాప్

– బలిజిపేట

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి..



వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వలంటీర్లతో కలిసి సోమవారం పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లు ప్రజలకు సేవలు అందించిన నిరుద్యోగ యువతీ యువకులను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేయడం బాధాకరమన్నారు.

– పార్వతీపురం టౌన్

యూటీఎఫ్ నాయకుల ప్రచారం..



జిల్లా స్థాయిలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి. శ్రీనివాసరావు, బి. ప్రసాదరావు కోరారు. ఈ మేరకు మండలంలో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వచ్చే నెల 3న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలోయూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు ఎం. గోవిందరావు, టి. అప్పలనాయుడు, బి. ఆదినారాయణ, డి. వెంకటరమణ, ఎన్. త్రినాథ్, జి. దాలయ్య, జె. సింహాచలం పాల్గొన్నారు.

– సీతానగరం